క్లుప్తంగా

మిగులు సీట్ల భర్తీకి చర్యలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో మిగిలి వున్న సీట్లు భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎ.రజనికుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త రూపవతి ఆదేశాల మేరకు ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న మిగులు సీట్లును భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఐదవ తరగతిలో 15 సీట్లు, 6వ తరగతిలో రెండు సీట్లు, 10వ తరగతిలో మూడు సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో ఐదు సీట్లు, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 11 సీట్లు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో రెండు సీట్లు ఖాళీగా వున్నాయన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జూలై 31న గురువారం ఉదయం గరుగుబిల్లిలోని పాఠశాలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అగ్ని ప్రమాద బాధితులను కాపాడే విధానంపై వివరిస్తున్న సిబ్బంది

సీతంపేట: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. మండలంలోని పొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాలు ఉపయోగించే విధానం.. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. పిడుగులు పడే ముందు ఎటువంటి చర్యలు తీసుకోవాలనేదానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం నల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాలాడలో వైద్యశిబిరం



వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు శివకుమార్, తదితరులు

భామిని: మండలంలోని తాలాడలో బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.శివకుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి సారథ్యంలో డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ తెరలు వాడాలని సూచించారు. వైద్యశిబిరంలో పలువురిని పరీక్షించి తొమ్మిది మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత



బిత్రపాడు వద్ద సారాతో పట్టుబడిన వ్యక్తి

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామ సమీపంలో అక్రమంగా సారా అమ్ముతున్నట్టు సమాచారంతో రావడంతో బుధవారం సిబ్బందితో కలసి దాడులు చేసి ఓ వ్యక్తిని పట్టుకున్నట్టు చినమేరంగి ఎస్ఐ అనీష్ తెలిపారు. ఆ వ్యక్తి నుంచి 20 లీటర్ల సారా పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మూలలంకలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా మూలలంక గిరిజన గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్స్‌కు వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దని.. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఆధార్ నంబర్, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా విపరీతంగా వాడొద్దు..


వీరఘట్టం: వరి నాట్లు వేస్తున్న రైతులు ఇష్టం వచ్చినట్లు యూరియా వాడొద్దని మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నుడుకూరు గ్రామంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమన్నారు.

సాయం కోసం ఎదురు చూపులు!



వరి ఊడ్పులు చేస్తున్న రైతులు

- వ్యవసాయ పెట్టుబడి సాయం అందించేదెప్పుడో..!
- బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలి..
- అన్నదాత ఆందోళన



గరుగుబిల్లి:

రైతులపై కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద అందిస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండేళ్లుగా అందించకపోగా పంటల బీమా సైతం రైతులే చెల్లించుకోవాలని ప్రకటించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురుపాం నియోజకవర్గంలో జంఝావతి, వట్టిగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టుల కింద సాగు చేయడంతో పాటు వర్షాధారంగా వరి పంటను సాగు చేస్తున్నారు. జంఝావతి ప్రాజెక్టు కింద కొమరాడ, పార్వతీపురం, గరుగుబిల్లి మండలాలలో 12వేల ఎకరాలలో, తోటపల్లి ప్రాజెక్టు కింద గరుగుబిల్లి, వంగర మండలాలలో 9వేల ఎకరాలలో, వట్టిగెడ్డ రిజర్వాయర్ పరిధిలో జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలలో 7వేల ఎకరాలలో ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేస్తున్నారు. వర్షాధారంగా వున్న పొలాలలో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. పంటలను సాగు చేస్తున్న రైతులు పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తోటపల్లి ప్రాజెక్టు కాలువల పరిధిలో గత కొద్ది రోజుల క్రితం కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయడంతో రైతులు వరి ఉభాలు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది జూలై నెలలో ఆశాజనకంగా వర్షాలు కురవకపోవడంతో చెరువులు, వర్షాధారంగా సాగు చేస్తున్న రైతులు ఆరంభంలోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అంతంతమాత్రంగానే వ్యవసాయ రుణాలు

చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకులు, సొసైటీల ద్వారా అంతంత మాత్రంగానే వ్యవసాయ రుణాలు అందుతున్నాయి. గతంలో తీసుకొన్న రుణాలను తిరిగి చెల్లిస్తేనే కొత్తగా రుణాలను అందిస్తున్నారు. తీసుకొన్న రుణం, వడ్డీ పోగా మిగిలినది అంతంతమాత్రంగానే ఉంటుంది.. కాగా ఏపీజీబీ బ్యాంకులలో కేవలం రుణానికి సంబంధించిన వడ్డీని చెల్లిస్తే తిరిగి రుణం ఇస్తుండటంతో రైతులకు కొంతమేర ఉపశమనంగా వుంది. ఖరీఫ్ సమయంలో పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు వ్యవసాయ మదుపులకు ఎంతో దోహదం చేస్తుంది. గత నెల రోజుల నుంచి అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూపులే తప్ప రైతులకిచ్చింది ఏమి లేదని రైతులు వాపోతున్నారు.

తప్పని ప్రీమియం చెల్లింపు

గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సకాలంలో రైతు భరోసాను ఖాతాలలో జమ చేసి ఆదుకొనేవారు. బ్యాంకులు, సొసైటీల ద్వారా కూడా సకాలంలో వ్యవసాయ రుణాలను అందించేవారు. గతంలో పంటల బీమాను కూడా ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుతం ప్రీమియంను కూడా రైతులే చెల్లించుకోవాలి. ఈ ఏడాది ఖరీఫ్ వరి పంటకు సంబంధించి ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాల్సి వుంది. ప్రీమియం చెల్లించడానికి రైతు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, ఈక్రాప్ నమోదును పూర్తి చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రీమియం చెల్లించాలి. రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడం లేదని వ్యవసాయ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ కారణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. కౌలు రైతులకు ప్రీమియం చెల్లించే విధానం లేక కొంత మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించేటట్టుగాప్రస్తుతం చెల్లించి ఆదుకోవాలి. అన్నదాత సుఖీభవ పథకాన్ని తక్షణం అమలు చేసి రైతులను ఆదుకోవాలి.

– ఎం.శంకరరావు, రైతు, ఉల్లిబద్ర

సురక్షిత నీటిని అందివ్వండి



సురక్షితమైన తాగునీటిని అందివ్వాలని కోరుతున్న బాలేసుగూడ గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాలేసు పంచాయతీ బాలేసుగూడ గ్రామానికి సురక్షితమైన తాగు నీటిని అందివ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామస్తులంతా గ్రామ సమీపంలోని నేలబావి నీటినే తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వర్షాల కారణంగా బావిలోని నీరు బురదమయంగా మారుతోందని, తప్పని పరిస్థితుల్లో ఆ నీటినే వినియోగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి సురక్షితమైన నీటిని తమ గ్రామస్తులకు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఫార్మాసిస్టులు లేకుండా మందులు విక్రయించరాదు



వీరఘట్టంలో ఓ ప్రైవేట్ క్లినిక్‌లో లైసెన్స్ పరిశీలిస్తున్న అధికారుల బృందం

వీరఘట్టం: మందుల దుకాణాల్లో ఫార్మాసిస్టులు లేకుండా మందులు విక్రయించరాదని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు, ఎస్సై జి.కళాధర్‌తో పాటు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పట్టణంలోని పలు ప్రైవేట్ క్లినిక్స్, మందుల దుకాణాలను పరిశీలించారు. అర్హత లేకుండా మందుల దుకాణాలను నిర్వహిస్తున్న వారిని వెంటనే మూసివేయాలని ఆదేశించారు. డాక్టర్ చీటీ లేకుండా మందులు విక్రయించరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న క్లినిక్‌లకు నోటీసులు ఇవ్వనున్నామని స్పష్టం చేశారు. తనిఖీల్లో సర్వే అధికారి జి.ప్రసాదరావు, వీఆర్‌ఓ బాసూరు శ్రీనివాసరావు, ఏఎస్సై కృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఆస్పత్రిలో ఎస్.భారతి, తదితరుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే, తదితరులు

పాలకొండ రూరల్: నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. సీతంపేట మండలం కేపీ ఈతమానుగూడ సర్పంచ్ ఎస్.భారతి, సోడంగి దంపతులను పరామర్శించారు. అలాగే పాలకొండ మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు తల్లి అన్నపూర్ణమ్మను ఆస్పత్రిలో పరామర్శించి, ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు.

కూటమి పాలన మోసపూరితం



బియ్యాలవలసలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ శ్రేణులు



పెదబుడ్డిడిలో కూటమి పాలన గురించి ప్రజలకు వివరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్ తదితరులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కూటమి ప్రభుత్వం చేసిన మోసాల్ని ప్రజలంతా గమనించాలని కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత అన్నారు. కురుపాం మండలంలోని బియ్యాలవలస గ్రామంలో బుధవారం వారు బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం.. గెలిచాక పథకాలు అమలు చేయకుండా అప్పులు చేస్తున్నారని.. ప్రజలు అడిగితే రాష్ట్రం తాకట్టు పెట్టాలంటూ.. తిరిగి బెదిరింపులకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే నిరుద్యోగులకు ఓ ఏడాది నిరుద్యోగ భృతిని, అలాగే ఆడబిడ్డలకు ఆడబిడ్డ నిధిని, రైతులకు అన్నదాత సుఖీభవ నిధులను ఎగ్గొట్టిందని గుర్తు చేశారు. కూటమి చేసిన మోసాలకు రాబోయే రోజుల్లో ప్రజలంతా తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు.

కూటమి పాలన అస్తవ్యస్తం

జియ్యమ్మవలస: కూటమి పాలన అస్తవ్యస్తంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట రమేష్ అన్నారు. పెదబుడ్డిడి, చినబుడ్డిడి, అంకవరం పంచాయతీలలో బుధవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రమేష్ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అబద్ధాలు, మోసాలతో పాలన సాగిస్తోందన్నారు. గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి కూటమి పాలన గురించి వివరించారు. కార్యక్రమంలో పెదబుడ్డిడి సర్పంచ్ సీమల సుజాత, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఎంపీటీసీలు, నాయకులు బాబూ భువన మోహనరావు, రాయగడ శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగస్టు 8, 9 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



మహా సభల కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: పాలకొండలో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కార్యవర్గ సభ్యుడు కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యుడు పువ్వల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొత్స మోహనరావు తదితరులతో కలిసి గుమ్మలక్ష్మీపురం గ్రామంలో బుధవారం జరిగిన వారపు సంత ప్రదేశంలో మహాసభల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను విడుదల చేశారు. సభలకు అన్ని రంగాల కార్మికులు, ప్రజలుతరలిరావాలని పిలుపునిచ్చారు.

నేటితో ముగియనున్న ఇంటర్ ప్రవేశాలు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు గురువారంతో ముగియనున్నాయని ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు తమ కళాశాలలో జనరల్ గ్రూపులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతో పాటు ఓఏ, ఎంఅండ్‌టీ, సీఈటీ వంటి వృత్తి విద్యా కోర్సులు ఉన్నాయన్నారు. అన్ని సబ్జెక్టులకు క్వాలిఫికేషన్ కలిగిన అధ్యాపకులు కూడా ఉన్నారన్నారు. కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, అన్ని సబ్జెక్టులకు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలు ఉన్నాయని, 2024–25లో టెన్త్ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

సమాజహితమైన కార్యక్రమాలు చేపట్టాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: యువత సమాజ హితమైన కార్యక్రమాలు చేపడుతూ.. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శక్తి టీమ్ ఇన్‌చార్జ్, ఏఎస్సై ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణ – వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. శక్తి యాప్ అనుసంధాన ప్రక్రియ, టోల్ ఫ్రీ నంబర్లు 1930, 1098, 112 ఆవశ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలమల అప్పరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటాలి..



పూజితను అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు

పాలకొండ రూరల్: ఉన్నత చదువుల్లో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటాలని ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు ఆకాంక్షించారు. తమ కళాశాల విద్యార్థిని ఎస్.పూజిత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ కెమిస్ట్రీ విభాగంలో చేరేందుకు ఎంపికై నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం సహ విద్యార్థుల మధ్య పూజితను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఎస్.జగన్‌మోహనరావు, ఎం.ప్రశాంతి, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.రాజు, తదితరులున్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు సూర్యనారాయణ

పాలకొండ: నగర పంచాయతీలో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు నెల్లి సూర్యనారాయణ కోరారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం పనిచేది సీపీఐ అని తెలిపారు. కష్టజీవుల పక్షాన పోరాటాలు చేస్తున్న సీపీఐకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని.. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. బెహర బంగారు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఉత్తరావల్లి మురళీమోహనరావు, బుడితి భారతి, స్వామిశేఖర్, శ్రీనివాసరావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పొలంబాట పట్టిన రైతులు

పాలకొండ రూరల్: వరుణిడి కరుణతో మండల పరిధిలోని రైతులు పొలంబాట పట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు సాగునీరు అందుబాటులో ఉండడంతో దమ్ములు, ఉడుపులు ముమ్మరంగా చేపడుతున్నారు. మండలంలోని ఓని, లుంబూరు, రాజుపేట, బాసూరు, గరుగుబిల్లి, పట్టణ శివారు, వీరఘట్టం రహదారికి ఇరువైపులా వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇదివరకే నాట్లు వేసిన పొలాల్లో ఎరువులు చల్లడంతో పాటు గట్టు వేసే పనుల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.

అవగాహనతో రోగాలు దూరం

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో అవగాహనతో రోగాలకు దూరంగా ఉండవచ్చని ఎం.సింగుపరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని అక్కిరాజుపేట, జంపరకోట, చిలకలవలస, తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి దోమలు ప్రబలకుండా మలాథియాన్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనారోగ్యం ఉంటే వెంటనే పీహెచ్‌సీకి రావాలన్నారు.

పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

గరుగుబిల్లి: ప్రజలు తమ హక్కులను తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని, ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని పౌర హక్కులపై ప్రజలకు పలు విషయాలను బుధవారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరూ కుల, మత, వర్ణ వివక్ష నిర్మూలనపై అవగాహన కలిగి వుండాలన్నారు. అలాగే చట్టాలు, సమానత్వం గూర్చి తెలుసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ ఒక్కరిని కించపరిచేలా, అవమాన పరిచేలా వ్యవహరించినా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



సీతంపేట: వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్సై



గుమ్మలక్ష్మీపురం: మూలిగూడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న కురుపాం ఎస్ఐ



పాలకొండ రూరల్: యువతకు సూచనలు చేస్తున్న సీఐ చంద్రమౌళి, తదితరులు



భామిని: ఏబీజీ చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్న బత్తిలి ఎస్సై అప్పారావు, సిబ్బంది

సీతంపేట: ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3 వరకు మావోయిస్టు వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పాలకొండ–కొత్తూరు, దోనుబాయి వైపు తిరిగే వాహనాలను బుధవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, స్థానిక దోనుబాయి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టి అనుమానితులపై నిఘా పెంచారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద ఎల్విన్‌పేట పోలీసులు, కురుపాం మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద కురుపాం పోలీసులు బుధవారం వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు , తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట/పాలకొండ రూరల్/భామిని: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మారుమూల దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని దారపాడు జంక్షన్ సమీపంలో ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టారు. పొల్ల, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి ఆధ్వర్యంలో పట్టణంలోని గారమ్మకాలనీ, ఇందిరానగర్ కాలనీ, వెంకటరాయుని కాలనీ, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. భామిని మండలం బత్తిలి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎస్సై జి.అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టి అనుమానితులపై ఆరా తీశారు.